క్లుప్తంగా

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

మ్యాంగో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం



నాగూర్‌బాషా

పాకాల:దామలచెరువు మ్యాంగో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం రీజనల్ చైర్‌పర్సన్ కెఎస్.మస్తాన్, జిల్లా చైర్‌పర్సన్ జి.రామయ్య ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా నాగూర్‌బాషా, సెక్రటరీగా ఆనంద్, కోశాధికారిగా రెడ్డిబాష, ఉపాధ్యక్షులుగా అశోక్‌కుమార్, నాగూర్‌ను ఎన్నుకున్నారు. ప్రజలకు సేవ చేయడానికి అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

రైల్వే తప్పిదంతోనే ప్రమాదం

తిరుపతి అర్బన్: రైల్వే తప్పిదంతోనే ఒడిశాలో రైల్వే దుర్ఘటన జరిగిందని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. ఆయన శనివారం కాంగ్రెస్ నేతలతో కలిసి తిరుపతి రైల్వే స్టేషన్ రెండో గేటు వద్ద నిరసన తెలిపారు. ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బాధితులను వెంటనే ఆదుకోవాలని కోరారు.

డీసీపీగా శ్రీనివాసులురెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ (డిప్యూటీ సిటీ ప్లానర్)గా శ్రీనివాసులురెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కమిషనర్‌ను కలిశారు. ఆయన గతంలో ఇక్కడ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేశారు. అనంతరం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుపతి అర్బన్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర రాష్ట్ర సమాచార, పీడబ్ల్యూడీ ప్రతినిధి సుబ్రమణ్యం కోరారు. ఆయన శనివారం జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి చెంగల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారే కూర్చునేలా చర్యలు చేపట్టాలని కోరారు. టికెట్ ధరలో 50 శాతం రాయితీ ఇవ్వాలని, దివ్యాంగుల పాస్‌లను వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని, 4 శాతం రిజర్వేషన్‌ను అనుసరించి ఆర్టీసీ దుకాణాల టెండర్లలో అవకాశం కల్పించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెంగల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ప్రయాణికులతో రైల్వే స్టేషన్ కిటకిట



తిరుపతి అర్బన్: వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భక్తుల రాక పెరిగింది. దీంతో తిరుపతి రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. రద్దీని ముందే గుర్తించిన అధికారులు వారికి ఇబ్బందులు కలుగకుండా చర్య లు చేపట్టారు. చోరీలకు తావులేకుండా రైల్వే ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో గస్తీ ముమ్మరం చేశా రు. హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రయాణికుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఒడిశాలో రైలు ప్రమాదం నేపథ్యంలో హౌరా ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేశారు.

కౌటిల్య విద్యార్థులకు ఐఐఎంలో అడ్మిషన్లు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్: దేశంలోనే ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) కళాశాలల్లో ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) ఫలితాల్లో తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 11 మంది విద్యార్థులు ఐఐఎం అహ్మదాబాద్, బెంగళూరు, లక్నో కళాశాలల్లో సీట్లు సాధించారు. అముజూరు మహేశ్వర్ 99.39 పర్సంటైల్ స్కోరుతో అహ్మదాబాద్ ఐఐఎంలో అడ్మిషన్ సాధించారు. అలాగే కరణం చందన 98.56 పర్సంటైల్ స్కోరుతో ఐఐఎం బెంగళూరు, రెడ్డెప్పగారి కేతన్‌రెడ్డి 99.62 పర్సంటైల్‌తో ఐఐఎం లక్నో, దొండపాటి తన్మయి 96.62 పర్సంటైల్ స్కోరుతో ఐఐఎం కోజికోడ్, దాసరి మురారి రెడ్డి. ఐఐఎం సిర్మోర్, బోధగయ, టి.భార్గవి 97.94 పర్సంటైల్‌తో ఐఐఎం కాశీపూర్, టి.హర్షవర్ధన్‌వర్మ ఐఐఎం అమృత్‌సర్ అడ్మిషన్లు పొందినట్టు కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. వారిని ఆయన భినందించారు.

రైతుకు భరోసా కేంద్రాలు



- చిన్నగొట్టిగల్లు మండలంలో 10 కేంద్రాలు
- వీటి నుంచే రైతులకు అన్ని సేవలు
- కలెక్షన్ సెంటర్లు 7
- సెరికల్చర్ షెడ్లు 6
- పాడిపరిశ్రమకు ఊతం

భాకరాపేట: పల్లెల్లోనే వ్యవసాయ సంబంధ సేవలన్నింటినీ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇవి రైతులకు భరోసా కల్పిస్తున్నాయి. మండలంలోని ప్రతి సచివాయ పరిధిలో అందుబాటులో ఉంటున్నాయి. ఈ కేంద్రాల్లో కీలకమైన భూసారం, ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షలు చేపడుతున్నారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగులో శిక్షణ ఇస్తున్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో 4,824 మంది రైతులు 11,337 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా వరి, టమాట, కూరగాయల పంటలతోపాటు చెరుకు, మామిడి, పట్టు తదితర పంటలు సాగులో ఉన్నాయి. అలాగే పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. పశువులు 10,839, గేదెలు 21, గొర్రెలు 10,488, మేకలు 2160 ఉన్నాయి. రైతులకు ఇప్పటి వరకు ఈ ఏడాది యూరియా, కాంప్లెక్స్ తదితర ఎరువులు 500 టన్నుల వరకు పంపిణీ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న 968 మంది రైతులకు రూ.43,37,235 పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు 413 మంది రైతులను ఎంపిక చేసి రూ. 11,62,711 అందించారు. 0 వడ్డీ పథకం కింద 4619 మంది రైతులకు రూ.2,09,41,337 అందేలా చూశారు. రైతు భరోసా కింద 4,824 మంది రైతులకు రూ.17,26,66,500ల పెట్టుబడి సాయం అందేలా చేశారు.

ప్రయోజనాలివే

- రైతులకు అధిక ఆదాయం, ప్రజలకు ఆహార భద్రత ప్రధాన ఉద్దేశం
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, భూసార పరీక్షలు, పంటల సాగు పద్ధతులపై అవగాహన.
- భూసార పరీక్షల ఆధారంగా ఏయే పంటలు సాగు చేయవచ్చో సలహాలు, సూచనలు.
- అనవసరంగా ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో తెగుళ్ల నివారణకు మార్గాలు.
- అగ్రీ షాప్స్ నుంచి వ్యవసాయ పనిముట్ల పంపిణీ. పంట దిగుబడి మార్కెటింగ్‌పై మెళకువలు.
- ఈక్రాప్ బుకింగ్‌పై రైతులకు తోడ్పాటు. ప్రభుత్వ రాయితీలకు సిఫార్సు.
- విత్తనం వేసింది మొదలు మార్కెటింగ్, గిరాకీ, సరఫరా వరకు రైతులకు సేవలు.
- ఈ క్రాప్ బుకింగ్ చేయిస్తూ పంటలు దెబ్బతిన్న సమయంలో పరిహారం అందేలా చర్యలు.
- పాడి పరిశ్రమ అభివృద్ధికి ఊతం. పశువులకు ఇంటి వద్దే వైద్య సేవలు.

ఒక్కో బస్తాకు రూ.20 నుంచి 50 వరకు ఆదా



నా పేరు రఘునాథ. మాది చట్టేవారిపాళెం పంచాయతీ బండారువాండ్లపల్లె. నేను ఎనిమిది ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నాను. ఆర్‌బీకేల వల్ల ఎరువులపై ఒక్కో బస్తాకు రూ.20 నుంచి రూ.50 ఆదా అవుతోంది. ఎరువులు దుకాణం నుంచి ఇంటికి చేరడానికి లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఖర్చులు లేకుండా చేశారు.

స్థానికంగానే భూసార పరీక్షలు



నా పేరు హరి. మాది కుమ్మరపల్లె. నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. భూసార పరీక్షలు చేసి ఏ పంట వేయాలి, ఎరువులు ఎలా వాడాలి తదితర వివరాలను ఎప్పటికప్పుడు అధికారులు గ్రామానికే వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. పంట నాణ్యత, దిగుబడులు సాధించేందుకు ఆర్‌బీకేలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి.

పల్లెలోనే సబ్సిడీ విత్తనాలు



నా పేరు గిరి. మాది దేవరకొండ పంచాయతీ గొల్లపల్లె. నేను మూడెకరాల్లో పంటలు సాగు చేస్తున్నా. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాలు ఇస్తున్నారు. పొలాల వద్దకే విత్తనాలు వచ్చినట్లు అనిపిస్తుంది. విత్తనాల నాణ్యత లేకపోతే తిరిగి ఇచ్చేస్తే వేరే తెచ్చి ఇస్తున్నారు. చాలా సౌలభ్యంగా ఉంది.

అందుబాటులోకి కలెక్షన్ సెంటర్లు



నా పేరు నలపరెడ్డి. మాది చిట్టేచెర్ల పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లె. నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. పండించిన పంటలను అమ్ముకునేందుకు వీలుగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్లు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మామిడి కాయలు సేకరిస్తున్నారు. రాబోయే రోజుల్లో అన్ని రకాల ధాన్యం సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఉగాది పురస్కారాలు ప్రదానం

తిరుపతి కల్చరల్: మహతిలో ఆదివారం తిరుపతి సిటీ ఛాంబర్ 26వ వార్షికోత్సవంనిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయూబ్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి జీవిత సాఫల్య అవార్డులు, ఉగాది పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు.

శ్వేతలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి ఎడ్యుకేషన్: టీటీడీలోని వివిధ విభాగాల్లో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగాల భర్తీకి ఈ నెల 13, 15వ తేదీల్లో శ్వేత భవనంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర తెలిపారు. అర్హత కల అభ్యర్థులు దరఖాస్తు, ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఎస్ఎల్ఎస్ఎంపీసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడాలని పేర్కొన్నారు.

రాళ్లపాటి ప్రతిభకు డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ రసాయన శాస్త్ర విభా గపు పరిశోధక విద్యార్థిని రాళ్లపాటి ప్రతిభ డాక్టరేట్ డిగ్రీ పట్టా పొందారు. ఆమె ప్రొఫెసర్ ఎన్‌వీవీ.జ్యోతి పర్యవేక్షణలో ఎక్సెస్ థర్మో డైనమిక్ అండ్ స్పెక్ట్రోస్కోపిక్ స్టడీస్ ఆఫ్ ఆర్గానిక్ లిక్విడ్ మిక్చర్ అనే అంశంపై పరిశోధన చేశారు.

జనసురక్షపై అవగాహన

రామచంద్రాపురం: సీరామాపురం సమీపంలోని స్టేట్ బ్యాంకు ఆవరణలో శనివారం జనసురక్ష ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఫైనాన్స్, ఆపరేషన్ ఏజీఎం రమేష్ గోపాలన్ అయ్యర్ మాట్లాడుతూ ఎస్బీఐ అందిస్తున్న పీఎంజీవై, పీఎంఎస్‌వై, అటల్ పెన్షన్ పాలసీలు ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయన్నారు.

నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యం



గుండె పరీక్షలు చేయించుకుంటున్న వ్యక్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : నియోజకవర్గంలోని ప్రజలందరి ఆరోగ్యమే తన లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రావారిపాళెం మండలం, చెరుకువారిపల్లె, ఎర్రావారిపాళెం క్రాస్‌లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను శనివారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వైద్యులతో చర్చించారు. 'నా ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్న సంకల్పమే నన్ను ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేలా చేసింది' అని అన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటే వారికి ఎమి చేసినా చేయకపోయినా పట్టించుకోరన్నారు. అందుకే రూ.2,950 విలువ చేసే వైద్య పరీక్షలను ఉచితంగా చేయిస్తున్నట్టు వివరించారు. దాదాపు 25 రకాల పరీక్షలు చేయించడంతో పాటు, వారి ఆరోగ్య వివరాలను గోప్యంగా సంబంధిత వ్యక్తికి షీల్డ్ కవర్‌లో అందించనున్నట్టు వెల్లడించారు. ఎంపీపీ శివలక్ష్మి, మండల పార్టీ నాయకులు చెంగల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఎంపీడీవో అమర్‌నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

ప్రయాణికుల మృతికి కేంద్రం బాధ్యత వహించాలి

తిరుపతి కల్చరల్: ఒడిశాలో రైళ్ల ప్రమాదంలో ప్రయాణికుల మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, రైల్వే మంత్రి రాజీనామా చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ డిమాండ్ చేశారు. దేశంలోని రైల్వే ట్రాక్‌ల రక్షణ సిబ్బంది, గ్యాంగ్‌మెన్ల కుదింపు, రైల్వే ప్రైవేటీకరణ వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మృతులకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాదం అత్యంత బాధాకరమని, రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికుల కుటుంబాలను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు.

సంకల్పమే విజయాన్ని చేకూరుస్తుంది



వేదికపై ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు

తిరుపతి తుడా: వైద్య వృత్తి ఉన్నతమైందని, ప్రజా సేవ చేయాలనుకునే వారు సివిల్స్‌కు సిద్ధం కావాలని డాక్టర్ జయచంద్ర భానుప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించి ఇటీవల సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్న అధికారులు శనివారం భువన విజయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు ఇటీవల కాలంలో సివిల్స్‌లో టాప్ ర్యాంకర్లుగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఎంచుకున్న వృత్తికి వంద శాతం న్యాయం చేయగలిగితేనే సార్థకత ఉంటుందన్నారు. సోషల్ మీడియాను వదులుకుంటే మీ లక్ష్యం మొదలైనట్టేనన్నారు. అనంతరం ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లుగా పనిచేస్తున్న మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు, సివిల్స్ సాధించేందుకు తాము కష్టపడిన విధానాన్ని వివరించారు. సివిల్స్ సాధించిన పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ షకీర్హుస్సేన్, డాక్టర్ హరిజవహర్ లాల్ జూమ్ యాప్ ద్వారా మాట్లాడారు. ఐపీఎస్ రమేష్‌రెడ్డి, ఐఏఎస్‌లు హేమేంద్ర, ధీరజ్ కుమార్ బచ్చు, వివేక్, పూజిత, వైద్యాధికారులు చంద్రశేఖర్, రవిప్రభు, పార్థసారథి, కిరీటి పాల్గొన్నారు.

వేడుకగా గోవిందరాజస్వామి చక్రస్నానం



తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, చక్రత్తాళ్వార్ ఊరేగింపుగా కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి చేరుకున్నారు. అనంతరం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. తర్వాత అక్కడి నుంచి టీటీడీ పరిపాలనా భవనం ఎదుటనున్న పీఆర్ తోటకు వేంచేపు చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారు అక్కడి నుంచి గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు స్వామివారు బంగారు తిరుచ్చిపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8.40 నుంచి 9.30 గంటల వరకు చేపట్టిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పెద్దజీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి, కంకణభట్టార్ ఏపీ.శ్రీనివాస దీక్షితులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ సిపాయి, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రెస్‌క్లబ్ సభ్యుల పిల్లలకు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సహకారంతో నగదు ప్రోత్సాహంతో పాటు ఆర్కే డిజిటల్ సొల్యూషన్స్ సహకారంతో జ్ఞాపిక, ప్రెస్ క్లబ్ డైరీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికి మరింత ప్రోత్సాహకాన్ని అందజేస్తానని తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. ప్రెస్‌క్లబ్ కోశాధికారి శ్రీకాంత్, కమిటీ సభ్యులు లావణ్య కుమార్, దినేష్, సునీల్, రష్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాబురావు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం (ఆర్ఎస్ఎస్)ఆల్ ఇండియా జాయింట్ జనరల్ సెక్రటరీ ముకుంద, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, నెల్లూరు ఎమ్మెల్సీ మెరుగ మురళి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పెట్రోల్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఉచిత వైద్య పరీక్షలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట: ఉచిత వైద్య శిబిరాల్లో చేస్తున్న పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం చిన్నగొట్టిగల్లులోని జగనన్న సమావేశ మందిరంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సోమవారం నుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డీఎల్‌డీవో సుశీలాదేవి మాట్లాడుతూ ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేయించాలన్నదే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకునేలా చూడాలని కోరారు. వైద్య పరీక్షల అనంతరం వారి రిపోర్టులను గోప్యంగా షీల్డ్ కవర్‌లో వారి ఇంటికి వచ్చి అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, వైద్యాధికారిణి శశికళ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



రోడ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, కమిషనర్ హరిత

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రోడ్లు, వీధులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె శనివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్ శేఖర్ రెడ్డితో కలిసి 42వ డివిజన్‌లో పర్యటించారు. ఖాదీ కాలనీ ప్రధాన రోడ్డులోని జగన్మాత చర్చి ముందు నుంచి ప్రకాశం పార్క్ వరకు వెళు తున్న 40 అడుగుల రోడ్డు 30 అడుగులకు కుదించుకుపోయిందని, దీన్ని 40 అడుగులకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో 50 మందికి టీడీఆర్ బాండ్లు రిలీజ్ చేసి, వారి సహకారంతో రోడ్డు వెడల్పు చేస్తామన్నారు. అదేవిధంగా పై వైశ్రాయ్ హోటల్ పక్కనుంచి కపిలతీర్థం రోడ్డును కలుపుతూ 20 అడుగుల రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నగరంలో రోడ్ల వెడల్పునకు సహకరించాలని, రోడ్లు వెడల్పుగా ఉంటేనే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. కో ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాల సుబ్రమణ్యం, షణ్ముగం, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, నాయకులు గిరిధర్, పవన్ పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని నిరసన

తిరుపతి కల్చరల్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యదర్శి పి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి విజయకుమార్, అధ్యక్షుడు రాజగోపాల్, మునికుమార్, ఐఎఫ్‌టీయూ నేతలు లోకేష్, మహేష్, వెంకటేష్, లత పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి నిరంతర కృషి

- మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్
- మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌లో కీలక నిర్ణయాలు



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, కమిషనర్ హరిత తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, సభ్యులు రామస్వామి, వెంకటేశ్వర్లు, నరసింహాచారి, గణేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల వారిగా తొలి ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వారు మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలే తొలి ప్రాధాన్యంగా గుర్తించినట్టు చెప్పారు. ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ వద్ద రైల్వే లైన్‌పై ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుకు గతంలో ఆమోదించిన రూ.80 లక్షలకు అదనంగా నేడు సవరించిన అంచనాలతో రూ.1.10 కోట్లు కేటాయించారు. పద్మావతీ మహిళా యూనివర్సిటీ వద్ద ఫ్రీ లెఫ్ట్ కోసం రూ.26.50 లక్షలు, భవాని నగర్‌లో డ్రైన్ పై స్లాబ్స్ వేసేందుకు రూ.42 లక్షలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సూచించిన మేరకు హెడ్ పోస్ట్ ఆఫీసు నుంచి హరిణి అపార్ట్‌మెంట్ వరకు పెద్ద కాలువను మార్చేందుకు, గంగమ్మ గుడి ఆర్చ్ వద్ద పెద్ద కాలువపై స్లాబ్ ఏర్పాటుకు రూ.49.65 లక్షలు కేటాయించారు. భవాని నగర్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పక్కన పాడైపోయిన రోడ్డు పనులకు రూ. 42 లక్షలు, రైల్వే కాలనీలో నూతన సచివాలయ బిల్డింగ్‌కు రూ.25 లక్షలు, మధురానగర్‌లో పాడైన భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.21 లక్షలు, 50వ వార్డులో రోడ్డుకు రూ.49.85 లక్షలు మంజూరుకు ఆమోదం. శ్రీనగర్ కాలనీ, ఎస్.ఎల్.వీ నగర్ ప్రాంతాల్లో కొత్త రోడ్లు, కాలువలు నిర్మించేందుకు రూ.34.75 లక్షలు, 50వ వార్డు టీచర్స్ కాలనీలో కొత్తగా తాగునీటి పైపులు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.23 లక్షలు, తూకివాకం డ్రైవేస్ట్ షెడ్‌కు సిమెంట్ కాంక్రీట్ రాంప్స్, ఫైర్ సేఫ్టీ మోటార్స్ రూమ్, వెట్ వేస్ట్ ప్లాట్ ఫార్మ్‌కు ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.30.80 లక్షలు, 1వ వార్డు శ్రీసాయి విష్ణు లే-అవుట్ ప్రాంతంలో కాలువలు నిర్మాణానికి రూ.16.50 లక్షలు, 49వ వార్డు అరుణోదయ నగర్‌లో సీసీ రోడ్ల కోసం రూ.19.70 లక్షలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారులు కేఎల్ వర్మ, సేతుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.